
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య
జిల్లా వార్తలు

5

ఆదివారం 7 జనవరి 2024

పోస్టాఫీసుల్లోనూ రూ.2 వేల నోట్ల మార్పు

● రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచన

కలికిరి, జనవరి 6: చలామణి నుంచి ఉపసంహరించిన రూ.2 వేల నోట్లను పోస్టాఫీసుల ద్వారా కూడా మార్చుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచనలు జారీ చేసింది. ఈ పద్ధతి నోట్ల రద్దు నుంచే ఉన్నా.. గడిచిన మూడు నెలలుగా నోట్ల మార్పిడిదార్లతో ప్రాంతీయ కార్యాలయాల ముందు క్యూలు పెరిగిపోతున్నందున పోస్టాఫీసుల ద్వారా మార్పిడి చేసుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్బీఐ మరోసారి ఈ విధానాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది. అయితే నేరుగా పోస్టాఫీసుల నుంచి మార్పిడి నోట్లు పొందేందుకు మాత్రం అవకాశం లేదు. కేవలం స్పీడ్ పోస్ట్ ద్వారా దేశంలోని ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాలకు నోట్లు పంపించి ఆ మొత్తాన్ని తమ బ్యాంకు ఖాతాల్లోకి డిపాజిట్ చేసుకోవచ్చు. దీనికి సంబంధించి ఆర్బీఐ పోర్టల్‌లో లభించే దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని అవసరమైన వివరాలు నింపి, దానికి రూ.2 వేల నోట్లను జతపరిచి పోస్టాఫీసుల ద్వారా ఆర్బీఐ రీజినల్ కార్యాలయాలకు సమర్పించుకోవచ్చని బ్యాంకింగ్ వర్గాలు వివరించాయి. 2016 నవంబరు 8న అప్పట్లో మహాత్మాగాంధీ సిరీస్‌తో చలామణిలో వున్న రూ.వెయ్యి, రూ.500 నోట్లను కేంద్రం అప్పటికప్పుడు రద్దు చేస్తూ ప్రకటించింది. దీనికి అనుగుణంగా ఈ నోట్లను పరిమితంగా మార్చుకోవడానికి మొదటిసారిగా రూ.2 వేల నోట్లతో పాటు మహాత్మాగాంధీ కొత్త సిరీస్‌తో రూ.500 నోట్లను కూడా అందుబాటులో వుంచారు. ఈ కొత్త సిరీస్‌కు కొనసాగింపుగా రూ.10, 20, 100, 200 నోట్లు కూడా చలామణిలోకి వచ్చాయి. ఏడేళ్ల తరువాత రూ.2 వేల నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తూ గతేడాది మే నెల 19న రిజర్వు బ్యాంక్ ప్రకటించింది. గతేడాది అక్టోబరు 7 నుంచి రూ.2 వేల నోట్ల చలామణిని ఉపసంహరించారు. అయితే వీటిని పూర్తిగా రద్దు చేయకపోవడంతో ఉపసంహరించినప్పటి నుంచి వాటిని ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల ద్వారా మార్చుకోవడానికి మాత్రం అనుమతించారు. దేశంలో మొత్తం 19 ప్రాంతీయ కార్యాలయాల (తిరువనంతపురం, పాట్నా, నాగపూర్, లక్నో, ముంబై, కొచ్చి, కోల్‌కత్తా, జమ్మూ, కాన్పూరు, చెన్నై, ఢిల్లీ, గౌహతి, భువనేశ్వర్, భోపాల్, హైదరాబాద్, అహ్మదాబాద్, చండీగర్, జైపూర్, బెంగుళూరు) వద్దకు స్వయంగా రాలేని వారికి పోస్టాఫీసుల ద్వారా పంపించుకునే అవకాశం కూడా కల్పించారు. అయితే ఈ సదుపాయాన్ని పక్కనపెట్టి నేరుగా అందుబాటులోని ప్రాంతీయ కార్యాలయాలకు వెళ్లేందుకే ప్రజలు మొగ్గు చూపేవారు. అయితే పోస్టాఫీసుల ద్వారా పంపడానికి మాత్రం ఇప్పటికీ ప్రజలు వెనకడుగేస్తున్నారు.

● కడప, రాయచోటి రాజంపేటలో

నేడే ముగ్గుల పోటీలు



తెలుగు సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా సంక్రాంతిని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ ఏటా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను ఈసారి ఆదివారం కడప, రాయచోటి, రాజంపేటలలో నిర్వహిస్తోంది. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గులపోటీలు..రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన, ఎయిమ్ ఇనిస్టిట్యూట్స్ సౌజన్యంతో మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరగనున్నాయి. కడప నగరంలో ఐటీఐ దగ్గర వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో, రాయచోటిలో కొత్తపేట రోడ్డులోని రాజు ఇంగ్లీష్ మీడియం స్కూల్ (ఒలంపియాడ్ బ్రాంచ్)లో, రాజంపేటలో శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలు జరిగే ప్రతి కేంద్రంలో రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున వరుసగా మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికయ్యే ఇద్దరు.. మొత్తం 15 మందికి విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. కడపలో జరిగే పోటీలకు వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాయచోటిలో జరిగే పోటీలకు రాజు ఇంగ్లీష్ మీడియం స్కూల్, రాజంపేటలో జరిగే పోటీలకు శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి.

- కడప, ఆంధ్రజ్యోతి

భూసేకరణ వేగవంతం చేయండి : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 6: 1800 మెగావాట్ల వీరబల్లి ఆఫ్- స్ట్రీమ్ క్లోజ్డ్ లూప్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుకు భూసేకరణ వేగవంతం చేయాలని కలెక్టర్ పీఎస్ గిరీషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పవర్ ప్రాజెక్టు ఏర్పాటు అంశంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు వీరబల్లి మండలంలో 616.56 ఎకరాలు, రామాపురం మండలంలో 59.35 సెంట్లు అవసరం అవుతాయని ప్రతిపాదిత ప్రాజెక్టు అధికారులు గుర్తించారన్నారు. ప్రాజెక్టు భూముల నిమిత్తం ఇప్పటికే ఫారం ఏ-2, ఫారం-సీలలో అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. ప్రాజెక్టు నిమిత్తం సేకరిస్తున్న భూముల్లో ప్రభుత్వ, డీకేటీ, పట్టా ల్యాండ్‌లలో నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లు, ఆర్డీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో రాజంపేట, రాయచోటి ఆర్డీవోలు రామక్రిష్ణారెడ్డి, రంగస్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ప్రసన్నకుమార్, ఆర్అండ్‌బీ డీఈ సహదేవరెడ్డి, ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, ఫారెస్టు అధికారులు, సంబంధిత తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



రాయచోటిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు



మదనపల్లెలో ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు



వాల్మీకిపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో నల్ల బెలూన్లతో నిరసనలు తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

ఒకటి కాదు, రెండు కాదు... ఏకంగా 400 ప్లాట్లు అక్రమంగా కాజేశారు. పేదలకు ఇచ్చిన 1700 ప్లాట్లలో ఇన్ని అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లడమంటే మామూలు విషయం కాదు. "ఒక్క లే-ఔట్‌లో ఇన్ని అక్రమాలు జరిగితే ఇక మిగిలిన వాటి పరిస్థితి ఏమిటి ?" అంటూ విచారణ చేపట్టిన పీలేరు రెవెన్యూ సిబ్బందే నోరెళ్లబెడుతున్నారు. "ఏదో పరకో పొరపాట్లు ఉంటాయిలే అనుకుంటే సుమారు 30 శాతం అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. జిల్లా అధికారులు విచారణ చేయమంటే ఏదో అనుకున్నాం కానీ కందిరీగతుట్టెను కదిలించి పొరపాటు చేశామా" అంటూ వారు ఆందోళన పడుతున్నారు. ఇదిలా ఉంటే అధికార పార్టీ నేతలు మాత్రం వారికి ఫోన్లు చేసి అటువైపు వెళ్లొద్దని పురమాయిస్తున్నారు. పేదల కోసం పీలేరు-మదనపల్లె మార్గంలో ఏర్పాటు చేసిన ఏపీఐఐసీ 3వ లే-ఔట్‌లో నెలకొన్న అక్రమాలు ఇప్పుడు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.

వామ్మో.. ఒక్క లేఔట్‌లో ఇన్ని అక్రమాలా..!



అక్రమ పునాదులు చదును చేస్తున్న అధికారులు (ఫైల్)

పీలేరు, జనవరి 6: పీలేరు మండలంలోని పీలేరు-మదనపల్లె మార్గంలో ఏర్పాటు చేసిన ఏపీఐఐసీ 3వ లే-ఔట్‌లో ఏర్పాటవుతున్న జగనన్న కాలనీల్లో ఎన్నో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. పేదలకు ఇచ్చిన ప్లాట్లలో దాదాపు 30 శాతం కాజేశారంటే వీరు ఎంతటి ఘనులో అర్థం చేసుకోవచ్చు. అసలు ఒక్క లేఔట్‌లో ఇన్ని అక్రమాలు జరిగాయా అని రెవెన్యూ అధికారులే నోరెళ్లబెడుతున్నారు. అధికార పార్టీ నేతలు మాత్రం వారికి ఫోన్లు చేసి తాము 'స్వంత అవసరాలు, స్వంత మనుషుల' కోసం కొన్ని ప్లాట్లు అట్టిపెట్టుకున్నామని, వాటివైపు వెళ్లొద్దని పురమాయిస్తున్నారు. తిలా పాపం, తలా పిడికెడు అన్నట్లు అధికార పార్టీ నేతలకు తోడు అప్పట్లో పీలేరులో పనిచేసిన అధికారులు కూడా తాము తక్కువ తినలేదంటూ తమ ఖాతాలో కొన్ని ప్లాట్లు పెట్టుకున్నామని, వాటిని వదిలేయాలని విచారణ చేస్తున్న సిబ్బందికి ఫోన్లు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో తమ పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్న చందరంగా తయారైందని రెవెన్యూ అధికారులు వాపోతున్నారు. తమ విచారణ సారంశాన్ని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందిస్తే అధికార పార్టీ నాయకుల ద్వారా ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనని వారు భయపడి నివేదికను అందజేయడంలో తాత్సారం చేస్తున్నట్లు సమాచారం.

తహసీల్దారు కార్యాలయ ముట్టడితో వెలుగులోకి..

ఏప్రిల్‌లో పట్టాలు మంజూరైనా డిసెంబరు ఆఖరు వరకు తమకు స్థలం చూపకపోవడం ఏమిటని ప్రశ్నిస్తూ గత ఏడాది డిసెంబరు 26న సుమారు 500 మంది లబ్ధిదారులు తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడించడంతో ఏపీఐఐసీ 3వ లే-ఔట్ అంశం జిల్లా ఉన్నతాధికారుల దృష్టిలో పడింది. పీలేరు పట్టణంలోని పేదలకు గత ఏడాది ఏప్రిల్‌లో పీలేరు-మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ భూముల్లో 3వ లే-ఔట్‌ను ఏర్పాటు చేసి అందులో 1700 మందికి పట్టాలు పంపిణీ చేశారు. అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం హడావిడిగా పట్టాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసిన అధికారులు ఆ కార్యక్రమంలో కేవలం పదుల సంఖ్యలో లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేసి, మిగిలిన వారిని తమ కార్యాలయం వద్దకు రమ్మని వెనక్కు పంపేశారు. ఆ తరువాత పట్టాల పంపిణీని సీరియస్‌గా తీసుకోలేదు. తమ పట్టాలు తమకు ఇవ్వండి మహాప్రభో అంటూ లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకుండా పైపెచ్చు అప్పటి అధికారులు లబ్ధిదారులపై మండిపడేవారు. అధికారుల జాప్యం అక్రమార్కులకు అవకాశంగా మారింది. ఆ లే-ఔట్‌లోని అధిక శాతం లబ్ధిదారుల వద్ద పట్టాలు లేవని తెలుసుకున్న అక్రమార్కు లు, అధికార పార్టీ నేతల కన్ను ఆ ప్లాట్లపై పడింది. జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో ఆ ప్లాట్లకు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర లభిస్తుండడంతో కొంత మంది అధికార పార్టీ నేతలు గతేడాది జూలై 6న లే-ఔట్‌లో సామాజిక అవసరాల కోసం వదిలిపెట్టిన ఖాళీ స్థలంలో రాత్రికి రాత్రే ఏకంగా 38 పునాదులు తవ్వేశారు. ఈ విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయిన పీలేరు వైసీపీ అధినాయకులు, వెంటనే వాటిని నిలపాలని అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు హుటాహుటిన వాటిని చదును చేసి భవిష్య త్తులో వాటి జోలికొస్తే కేసులు పెడతామంటూ బహిరం గ ప్రకటన చేశారు. లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసిన అధికారులు, వెంటనే ఆయా లబ్ధిదారు లకు వారికి దక్కిన పట్టాను అందించి ఉంటే ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేవని, అధికారుల నిర్లక్ష్య, నాన్చివేత ధోరణి కారణంగా అక్ర మార్కులు చెలరేగిపో యారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యం లో గత నెల 24న ఏపీఐఐసీ-4 పేరుతో మరో లే-ఔట్ ఏర్పాటు చేసి మరో 1700 మందికి పట్టాలు పంపిణీ చేశారు. అదే రోజు సంపూర్ణంగా పట్టాలు అందివ్వడం, వారికి స్థలా లు సైతం కేటాయించడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఏప్రిల్ మాసం లబ్ధిదారులు తమకు న్యాయం చేయాలంటూ తహసీల్దారు కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ గిరీషా, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ స్థానిక ఏపీఐఐసీ 3వ లే-ఔట్‌పై విచారణ జరపాలని స్థానిక అధికారులను ఆదేశించారు.

> **విచారణ జరుపుతున్నాం..**
>
> ఏపీఐఐసీ 3వ లే-ఔట్‌లో సమగ్రంగా విచారణ జరుపుతున్నాం. త్వరలోనే నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.
>
> - ధనంజయులు, తహసీల్దారు

టోకెన్ ఒకరికి.. పట్టా మరొకరికి

ఏపీఐఐసీ 3వ లే-ఔట్‌లో ప్రస్తుత రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో విస్తుగొలిపే కొన్ని అంశాలు వెలు గులోకి వచ్చాయి. అక్కడ కేవలం అధికార పార్టీ నాయ కులు మాత్రమే ప్లాట్లను ఆక్రమించుకోలేదని, లే-ఔట్ ఏర్పాటు సమయంలో పీలేరు తహసీల్దారు కార్యాల యంలో పనిచేసిన సిబ్బంది కూడా తమ చేతివాటం ప్రదర్శించారనే నిజాలు కూడా తెలిశాయి. తమ వద్ద ఉన్న రికార్డులు పట్టుకుని విచారణకు వెళ్లిన అధికారు లకు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు అర్థం కావడం లేదు. రెవెన్యూ రికార్డుల్లో ఒకరి పేరు ఉంటే క్షేత్రస్థాయి లో మరొకరు ఆ ప్లాటు తమదని వస్తున్నారు. ఒకే లక్కీ డిప్ టోకెన్ నెంబరుతో ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారులు ప్రత్యక్షమవుతున్నారు. టోకెన్‌లను నిర్ధారించుకునే లోపు పట్టాలు చూపిస్తున్నారు. ఆ పట్టాలు కూడా గతేడాది ఏప్రిల్‌లో పంపిణీ చేసినవి కాకుండా అంతకు మునుపు పంపిణీ చేసినవి చూపిస్తున్నారు. దీంతో ఏం చేయాలో పాలుపోక రెవెన్యూ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. మరికొంత మంది వద్ద ఏ ఆధారమూ లేకపోయినా పునాదులు తీసేసుకున్నారు. ఆ ప్లాట్లు మీకు ఎవరు చూపించారని ప్రశ్నించిన అధికారులకు వారు గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతల పేర్లు చెబుతున్నారు. వారికి అంతో ఇంతో సమర్పిం చుకుని వారి వద్ద నుంచి ప్లాట్లు నెంబరు తీసుకున్నామ ని, ఇప్పుడు కాదంటే తాము అన్యాయమైపోతామని వారు అధికారులను వేడుకుంటున్నారు.

● నోరెళ్లబెడుతున్న రెవెన్యూ అధికారులు
● 1700 ప్లాట్లలో 400 అక్రమాలు గుర్తింపు
● చూసీచూడనట్లు పోవాలని అధికారులు, నేతల ఫోన్లు
● పీలేరులో వెలుగుచూసిన విస్తుపోయే నిజాలు

అక్రమార్కుల చేతుల్లో సుమారు 400 ప్లాట్లు

ఏపీఐఐసీ 3వ లే-ఔట్‌లోని 1700 ప్లాట్లలో సుమారు 400 ప్లాట్లు అక్రమార్కుల చేతుల్లో ఉన్నట్లు అధికారులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అందులో పీలేరు పట్టణానికి చెందిన ఓ మండలస్థాయి ప్రజాప్రతినిధి చేతిలో సుమారు 150, పీలేరు పంచాయతీ స్థాయి నేత చేతిలో 80, చోటామోటా నేతల చేతుల్లో 80, ఇద్దరు ఆర్ఐల చేతుల్లో 40, ఓ వీఆర్వో చేతిలో 40 వెరసి 390 ప్లాట్లు బ్లాక్ చేశారని సమాచారం. దీంతో ఉన్నతాధికారులకు ఏం సమాధానం చెప్పాలో తెలియక ప్రస్తుత రెవెన్యూ అధికారులు తమ నివేదికను అందించకుండా తాత్సారం చేస్తున్నట్లు తెలిసింది. తమ చేతుల్లో ప్లాట్లు పెట్టుకున్న నేతలు, ఉద్యోగులు వాటిని చూసీచూడనట్లు వదిలేయాలని విచారణ అధికారులకు ఫోన్లు వస్తున్నాయని, వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియక విచారణ బృందాలు సతమతమవుతున్నాయని రెవెన్యూ కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా మండలంలో అందజేసిన 12 వేల పట్టాలపై విచారణ జరిపితే ఇంకెన్ని అక్రమాలు బయటకు వస్తాయోనన్న వ్యాఖ్యలు సైతం వినిపిస్తున్నాయి.



ఏపీఐఐసీ 3వ లే-ఔట్‌లో గతంలో వెలసిన అక్రమ పునాదులు (ఫైల్)

అంగన్వాడీలంటేే.. అలుసా..!

● సమ్మెపై ఎస్మా ప్రయోగం ● అయినా వెనక్కు తగ్గకుండా నిరసన ● జీవో ప్రతులు దగ్ధం ● సమ్మె కొనసాగుతుందని స్పష్టం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం గత 26 రోజులుగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలపై జగన్ ప్రభుత్వం.. ఎస్మా అస్త్రాన్ని ప్రయోగించింది. ఆరు నెలల పాటు అంగన్‌వాడీ సమ్మెను నిషేధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై అంగన్‌వాడీలు భగ్గుమంటున్నారు. ఎస్మా కాదు.. ఇంకా ఏవైనా చట్టాలు ప్రయోగించినా.. బెదిరేది లేదని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఎస్మా చట్టం ప్రతులను రిలేదీక్షా శిబిరాల వద్ద దగ్ధం చేశారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ.. సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు.

● వాల్మీకిపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో శనివారం అంగన్‌వాడీలు నల్ల బెలూన్లతో నిరసన తెలిపారు. అంగన్వాడీలు, కార్యకర్తలను ఉద్యోగాల నుంచి తొలగించే ప్రయత్నం చేసిన వైసీపీ ప్రభుత్వానికి చేటు తప్పదని అంగన్వాడీ యూనియన్ లీడర్లు హెచ్చరికలు చేశారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, మినీ వర్కర్లు, హెల్పర్లు, నల్ల బెలూన్లు చేతబట్టి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గడిచిన 26 రోజుల్లో ప్రభుత్వం కనీసం ఒక రోజు కూడా అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదన్నారు.

● మదనపల్లె ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్వాడీ ఉద్యమంపై ఉక్కుపాదం మోపేందుకే ఎస్మా చట్టం అమలు చేస్తోందని పేర్కొన్నారు. అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్ పాల్గొని మద్దతు ఇచ్చారు. అంగన్వాడీలకు ఆర్జే వెంకటేశ్ మధ్యాహ్నం భోజనం అందించారు.

● తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండెం మండలాలకు చెందిన అంగన్వాడీలు, హెల్పర్లు శనివారం తంబళ్లపల్లె, మూడు రోడ్ల కూడలిలో భైఠాయించి ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

● రైల్వేకోడూరు, ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీలు, సహాయకులు ఎస్మా జీవో ప్రతులను కాల్చివేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు రమాదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్‌లు ఎస్మా జీవో ప్రతులను కాల్చివేశారు.

● బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు నోటికి గడ్డి కరుచుకని నిరసన తెలిపారు. యూనియన్ నాయకురాళ్లు శ్రీవాణి, చాంద్‌బీ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే గౌరవవేతనంతో గడ్డి తిని బతకాలా అంటూ.. ప్రశ్నించారు. ఏ చర్యలు తీసుకున్నా భయపడేది లేదన్నారు.

● రాజంపేటలో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల పాటు సమ్మె చేయరాదని ఎస్మా ప్రయోగించినా అంగన్‌వాడీలు వెనక్కు తగ్గలేదు. శనివారం యూనియన్ నాయకులు ఈశ్వరమ్మ, సీఐటీయూ నాయకుడు రవికుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

● రాయచోటి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదురుగా సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన రిలేదీక్షల్లో ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు పాల్గొన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె ఆపే ప్రసక్తే లేదని, ఎస్మా ప్రయోగించినా.. పోరాడి రాబోయే రోజుల్లో ఉధృతం చేస్తామన్నారు. యూనియన్ నాయకురాలు డి.భాగ్యలక్ష్మి అధ్యక్షతన రిలేదీక్షలు జరిగాయి. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మితో పాటు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ సమ్మె

రాజంపేట మున్సిపల్ కార్యాలయాన్ని శనివారం పారిశుధ్య కార్మికులు ముట్టడించారు. తమ వేతనాలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పెంచాలని డిమాండ్ చేశారు. ముట్టడించిన పారిశుధ్య కార్మికులను పోలీసులు బయటకు ఈడ్చుకెళ్లారు. సీఐటీయూ నాయకుడు రవిని అరెస్టు చేసి పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో రాజంపేట డివిజన్‌లో పనిచేస్తున్న ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు తమకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఈ నెలలో ఆరు రోజులు గడిచినప్పటికీ, ఇంకా జీతాలు ఇవ్వకపోవడం దారుణమని నాయకులు సత్యనారాయశర్మ (జేఏసీ) పేర్కొన్నారు. యూఈఈయూ (సీఐటీయూ) నాయకులు శ్రీహరి తదితరులు పేర్కొన్నారు.



రైల్వేకోడూరులో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు, ఆయాలు

ఉపాధి కూలీల ఆకలి కేకలు

ఒకప్పుడు ఉపాధి పనులకు వెళ్తే పలానా సమయంలో డబ్బులు చేతికందుతుందనే నమ్మకం ఉండేది. తద్వారా కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు. కానీ ఈ ప్రభుత్వంలో ఎప్పుడు వస్తుందో.. ఏమో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతంలో రెండు వారాలకొకసారి కూలి డబ్బులు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు మూడు నెలలైనా కూలీ డబ్బులు రాక ఆకలితో అలమటిస్తున్నారు. అసలు ఎప్పుడు ఇస్తారన్న విషయం కూడా తెలియక అయోమయంలో ఉన్నారు. 10 రోజుల్లో సంక్రాంతి రానే వస్తోంది. పండుగ పూటా పస్తులు ఉండాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మూడు నెలలుగా ఎదురు చూపులే..! ● పండుగ పూట పేదలు పస్తులేనా..?



సాతపల్లె కుంటలో పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

పెనగలూరు, జనవరి 6: ప్రస్తుత కాలంలో నిరుపేద కూలీలకు ఉపాధి హామీ పథకం పనులే శరణ్యమయ్యాయి. ఈ పనులు తప్ప మరో గత్యంతరం లేక నిరుపేద వ్యవసాయ కూలీలతో పాటు, భవన నిర్మాణ కార్మికులు, కౌలు రైతులు, మోతుబరి రైతులు కూడా ఈ పనులకే వెళుతున్నారు. అందువల్ల పేద, మధ్య తరగతి ప్రజలు కూడా ఏ మాత్రం వెనకాడకుండా నిత్యం ఉపాధి హామీ పనులకు వెళు తున్నారు. గతంలో రెండు వారాలకొకసారి తప్పనిసరి కాక పోయినా మూడవ వారంలో కూలీ డబ్బులు వచ్చేవి. దాదాపు నెలయ్యే సరికి కూలీ డబ్బులు చేతికందుతున్నందున కూలీలు ఎలాగోలా తమ సంసారాన్ని నెట్టుకొచ్చేవారు. కానీ ఈ ప్రభుత్వంలో మూడు నెలలుగా కూలీలకు డబ్బులు చెల్లింపులు జరపడం లేదు. ఈ వారం కాకపోయినా మళ్లి వారమైనా అకౌంట్లలో డబ్బులు పడతాయేమోనని కూలీలు నిత్యం బ్యాంకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూ నిరు త్సాహంగా వెనుదిరుగుతున్నారు. సంక్రాంతి పండుగ సరిగ్గా 10 రోజులు కూడా లేకపోవడంతో పండగ్కైనా కూలీ డబ్బులు వస్తాయో రావోనని ఆవేదనలో ఉన్నారు. అప్పటికి కూడా కూలీ డబ్బులు రాకపోతే పండుగ ఎలా చేసు కోవాలంటున్నారు. తాము చేసిన పనులను బట్టి ఒక్కో కూలీకి సగటున రూ.8 వేల నుంచి రూ.10 వేల దాకా కూలీ డబ్బులు రావాలని చెబుతున్నారు. మండల వ్యాప్తంగా రోజుకు 300 మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఈ లెక్కన రూ.30 లక్షలు పైబడి కూలీ డబ్బులు రావాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్న ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కూలీలకు చెల్లింపులు జరిగేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పండక్కు గుడ్డలు ఎప్పుడు తెస్తావంటున్నారు



మూడు నెలల నుంచి కూలీ డబ్బులు రాలేదు. పండుగ దగ్గర కొస్తోంది. పిల్లలు కొత్త గుడ్డలు ఇంకెప్పుడు తెస్తావంటున్నారు. ఇంట్లో ఏం సమాధానం చెప్పాలో దిక్కు తోచడం లేదు. ఏ పనులు లేక ఉపాధి పనులకు వెళితే.. డబ్బులు ఇవ్వకపోతే సంసారం ఎట్లా గడిసేది.

- నేతగాని చిన్నక్క, సాతపల్లి హరిజనవాడ

బ్యాంకుల చుట్టూ తిరిగి కాళ్లరుగుతున్నాయి



తాను ఇటుకలు తయారీ పనిలో ఆరితేరిన వాడిని. ఇటుకలకు డిమాండు తగ్గడంతో ఉపాధి కూలీ పనికి వెళుతున్నా.. నాకు ఆరు వారాల కూలీ డబ్బు రావాలి. ఎప్పు డొస్తుందా అని ఎదురు చూస్తున్నా. బ్యాంకుల చుట్టూ తిరిగి తిరిగి కాళ్లు అరుగుతు న్నాయే తప్పితే కూలీ డబ్బులు మాత్రం అకౌంట్‌లో పడలేదు.

- బద్దల వెంకటేష్, సాతపల్లి హరిజనవాడ

వ్యవసాయ పనులు లేక...



నేను సాధారణ వ్యవసాయ రైతును. చెరువు కట్ట తెగి పోవడంతో రెండేళ్లుగా పెనగలూరు ఆయకట్టు బీడుగా మారిపోయింది. అప్పటి నుంచి ఉపాధి హామీ పనికిపోతున్నా.. నాకు 8 వారాల డబ్బులు రావాలి. వ్యవసాయ పనులు లేవని దీనికొస్తే ఇదీ అలాగే కాలబడింది.

- కలివేల కృష్ణయ్య, పెనగలూరు

ఏపీవో మురళి ఏమంటున్నారంటే..



మండలంలో నిత్యం 300 మందికి తగ్గకుండా కూలీలు పూడికతీత పనులు చేస్తున్నారు. అలాగే కంద కాల తవ్వకం, పండ్లతోటలలో గడ్డి, పిచ్చి మొక్కల తవ్వకం, నీరుపోయడం చేస్తున్నారు. అక్టోబరు 15 నుంచి కూలీ చెల్లింపులు జరగకపోవడం వాస్తవమే.

- మురళి, ఏపీవో, పెనగలూరు

విషపదార్థం తిని మూడు నెమళ్లు మృతి



మృతిచెందిన నెమళ్లకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న దృశ్యం

ముద్దనూరు జనవరి 6: స్థానిక అటవీ శాఖ రేంజ్ కార్యాలయం వద్ద శనివారం విషపదార్థం తిని మృతి చెందిన నెమళ్లకు పశువైద్యాధికారి హిమబిందు పోస్టుమార్టం నిర్వహించారు. అటవీ రేంజిఅధికారి అశోక్‌కుమార్‌యాదవ్ సమాచారం మేరకు.. మండల పరిధి చిన్నదుద్యాల గ్రామ పొలాల సమీపంలోని గాలేరు-నగిరి కాల్వ వద్ద శుక్రవారం 3 నెమళ్లు గాలిలో విలవిల్లాడి కిందపడి చనిపోయాయని రైతులు గుర్తించారు. నెమళ్లకు పోస్టుమార్టం నిర్వహించి, కాల్చివేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు రత్నరాజు, రజనీకుమార్,పద్మనాభయ్య, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

దువ్వూరు(మైదుకూరు), జనవరి 6: ప్రతి రోజు కూరగాయలు అమ్ముకొంటూ జీవనం గడిపే వృద్ధురాలు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన ఘటన శనివారం ఉదయం దువ్వూరు మండలం ఇడమడక వద్ద జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. ఇడమడకకు చెందిన మహబూబ్‌బీ (72) నిత్యం దువ్వూరు నుంచి కూరగాయలు తెచ్చుకుని అమ్ముకుంటుండేది. ఈ క్రమంలో శనివారం ఉద యం దువ్వూరులో కూరగాయలు తీసుకొని, చాగలమర్రికి చెందిన పుల్లయ్య ద్విచక్రవాహనంలో ఇడమడకకు పోతుండగా వెనుక వైపున కారు ఢీకొంది. ఈ ఘటనలో మహబూబ్‌బీ అక్కడిక్కడే మృతి చెందగా, పుల్లయ్య తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

అధికారులపై జేసీ ఆగ్రహం



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గణేశ్‌కుమార్

కడప(కలెక్టరేట్), జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. బాధ్యతలు అప్పగించిన అధికారులు ఇంతవరకూ ఆడిన క్రీడల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల తీరుపై జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కలెక్టరేట్ స్పందన హాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణపై సంబంధిత నోడల్ అధికారులు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ఆసక్తి, మానసిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అన్ని వయసుల వారు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చన్నారు విధులు కేటాయించిన అధికారులు బాధ్యతగా అన్ని దశలను సంపూర్తి చేయాల న్నారు. క్షేత్ర స్థాయిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని అధి కారులు ప్రణాళికతో పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు క్రీడా ప్రాంగణాల్లో అన్నిరకాల వసతులు కల్పించి, క్రీడలను వీక్షిం చేందుకు స్థానికులు ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు, మండల ప్రత్యేకాధికారులు, డీఎల్‌డీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నాన్‌బెయిలబుల్ వారంట్ జారీ

మైదుకూరు, జనవరి 6: ఒక కేసు విషయంలో ముద్దాయిగా ఉంటూ కోర్టుకు హాజరుకాకపోవడంపై నాన్‌బెయిలబుల్ వారెంటును జారీ చేసినట్లు ఎస్ఐ మద్దిలేటి ఒక ప్రకటనలో తెలిపారు. 190/2011 కేసుకు సంబంధించి కాశినాయన మండలం అమగంపల్లెకు చెందిన చెంచుల విజయ్‌కుమార్ అలియాస్ రాబర్ట్ ముద్దాయిగా, అరెస్టు వారెంట్ ఉందని పలుమార్లు కోర్టుకు హాజరుకానందుకు నాన్‌బెయిలబుల్ జారీ చేశారన్నారు. ఈనెల 18 లోపు స్టేషన్‌లోగాని లేదా నేరుగా గాని హాజరుకావాలని ఆయన తెలిపారు.

ఆటో బోల్తా ఒకరి మృతి

కొండాపురం, జనవరి 6: మండలంలోని దొబ్బుడుపల్లె-నక్కొనిపల్లె గ్రామాల మధ్యలో శుక్రవారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో షేక్షావలి(35) అనే వ్యక్తి మృతిచెందాడు. ఎర్రగుడి గ్రామానికి చెందిన షేక్షావలి, సుబ్బరాయుడు మైలవరం మండలంలోని బుచ్చంపల్లె గ్రామంలో బియ్యం కొనుగోలు చేసి తీసుకెళుతుండంగా ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవింగ్ చేస్తున్న షేక్షావలి కిందపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తి సుబ్బరాయుడు గాయపడగా ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ మోహన్ తెలిపారు.

జాతీయ హాకీ జట్టుకు శాంకరి ఎపిక



విద్యార్థినిని అభినందిస్తున్న సీఈఓ భానుప్రకాష్

పులివెందుల టౌన్, జనవరి 6: అండర్-14 హాకీ జాతీయ జట్టుకు పులివెందుల విద్యార్థి శాంకరి ఎంపికైనట్లు విద్యాధరి స్కూల్ సీఈఓ భానుప్రకాష్ తెలిపారు. 2023 డిసెంబరు 31 నుంచి 2024 జనవరి 3వ తేది వరకు గ్వాలియర్‌లో ఎస్‌జీ ఎఫ్ఐ ఆధ్వర్యంలో అంతర్‌రాష్ట్ర అండర్-14 బాలికల హాకీ టోర్నమెట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొని ప్రతిభ చూపిందన్నారు. దీంతో జాతీయ స్థాయి జట్టుకు ఎంపికైంద న్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని శాంకరిని పాఠశాల సీఈఓ, కరస్పాండెంట్ నాగరాజు, ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, ఉపాధ్యా యులు అభినందించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని పాదచారి మృతి

ఓబులవారిపల్లె, జనవరి 6: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ పాదచారి మృతి చెందాడు. మంగంపేటలోని ఆర్ఆర్ వీధికి చెందిన షేక్ రంజాన్ (47) లారీ డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలో నడిచి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

● 300 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని, నిందితులను అదుపులోకి తీసుకున్న విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం), జనవరి 6: జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్రానికి తరలిపోతున్న పీడీఎస్ రేషన్ బియ్యంను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి సీజ్ చేశారు. అందిన సమాచారంపై కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మసూంబాష ఆదేశాలతో చెన్నూరు నుంచి కడప మీదుగా కర్ణాటక రాష్ట్రానికి పీడీఎస్ రేషన్ బియ్యంను అక్రమంగా వాహనంలో తరలిస్తుండగా సీకేదిన్నె మండలం బుగ్గ అగ్రహారం రోడ్డులోని శ్రీ సాయి గణేశ్ గోడౌన్ వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 14,200 కిలోల రేషన్ బియ్యం, ఏపీ04 యుఏ 0045 నెంబరు ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు చెన్నూరు వాసులు కాటం బ్రహ్మయ్య, కొండూరి హరిక్రిష్ణ చెన్నూరు చుట్టుపక్కల గ్రామాల్లోని ఇళ్లల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి అక్కడి ఓ ఇంట్లో నిల్వ ఉంచి అనంతరం కర్నాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. సదరు వాహనాన్ని తనిఖీ చేసి రేషన్ బియ్యం, ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. మొత్తం విలువ రూ.17,75,100లుగా నిర్ధారించినట్లు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సీకెదిన్నె ఎస్ఐ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ఈదురు బాషా, జి.శ్రీనివాసులు, అసిస్టెంట్ జియాలజిస్ట్ బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసరు, సీఎస్‌డీటీ పి.సౌజన్య, బుగ్గఅగ్రహారం వీఆర్వో శిఖామణి, విజిలెన్స్ సిబ్బంది నాగేశ్వర్‌రావు, క్రిష్ణానాయక్, రంతుబాషా, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం

- స్మగ్లర్ అరెస్టు

రైల్వేకోడూరు, జనవరి 6: రైల్వేకోడూరు రేంజి పరిధి లోని గాదెల అడవిలో శనివారం అటవీశాఖ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వ హించి ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. రైల్వేకోడూరు రేంజర్ రఘు నాథరెడ్డి మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన స్మగ్లర్ చిన్న పొన్నును అదుపులోకి తీసుకుని 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ దాడుల్లో గాదెల ఎఫ్ఎస్‌వో ఎం.మహేష్ కుమార్, ఎఫ్‌బీవో బి.దేవారెడ్డి, ఎఫ్‌బీవో ఎం.నాగేశ్వర్ నాయక్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కడపలో రాష్ట్ర స్థాయి క్రికెట్ మ్యాచ్‌లు

కడప(స్పోర్ట్స్), జనవరి 6: కడప రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి (ఎ.సి.ఎ) క్రికెట్ స్టేడియంలో ఈ నెల 7 నుంచి బీసీసీఐ రాష్ట్ర స్థాయిలో కల్నల్ సి.కె. నాయుడు (అండర్-23) మల్టీ డే క్రికెట్ మ్యాచ్‌లు జరుగునున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. అందులో భాగంగా 7వ తేది నుంచి 10వ తేది వరకు ఆంధ్ర- గోవా జట్ల మధ్య మొదటి మ్యాచ్ సాగనుందన్నారు. తదుపరి రెండవ మ్యాచ్ ఈ నెల 28 నుంచి 31 వరకు ఆంధ్ర- ఛత్తీస్‌ఘడ్ జట్ల మధ్య సాగుతుందన్నారు. చివరగా వచ్చే ఫిబ్రవరి 18-21 వరకు ఆంధ్ర- రైల్వేస్ జట్ల మధ్య మూడవ మ్యాచ్ ఉంటుందన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ. ఓబులు


రైల్వేకోడూరులో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు


రైల్వేకోడూరు: జీవో ప్రతులను కాల్చివేసి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు


సుండుపల్లె: ఒక రోజు నిరాహార దీక్ష చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

పోరాటంతోనే ఎస్మాను ఎదుర్కొంటాం..

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 6: ఎస్మా వంటి చట్టాలతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ. ఓబులు అన్నారు. అన్నమయ్య కలెక్టరేట్ ఎదుట శనివారం భాగ్యలక్ష్మి అధ్యక్షతన చేస్తున్న నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. 15 మంది అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు ఆయన నిరాహార దీక్షలో పాల్గొన్నారు. వారందరూ 11వ తేదీ ఉదయం 10 గంటల వరకు వారు దీక్షలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొండిగా వ్యవహరి స్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ వేతనాల పెంపు ఇతర డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాజకీయ పార్టీలు, కార్మిక, ప్రజా సంఘాలు, లౌకిక, ప్రజా తంత్ర వాదులు, ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, కోశాధికారి బంగారుపాప, ఉపాధ్యక్షురాలు ఖాజాబీ, విజయ, అరుణ, పావని, ఖాజాబీ, సుమలత, అరుణ, పద్మజ, లక్ష్మీదేవి, భూ దేవి,సబీనా, రమీజా, ఇందిరమ్మ, సురేఖ పాల్గొన్నా రు.

రైల్వేకోడూరు: ప్రభుత్వం ఎస్మా ఉపయోగించినా భయపడే ప్రసక్తి లేదని రైల్వేకోడూరు అంగన్వాడీ సంఘం అధ్యక్షురాలు రమాదేవి, జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఎస్మా జీవో-2 ప్రతులను కాల్చి వేశారు. అంగన్వాడీలు చేస్తున్న న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పట్టించుకోక పోగా, ఎస్మా ప్రయోగిస్తామని జీవో విడుదల చేయడం దారుణమని జనసేన సీనియర్ నాయకుడు గంధంశెట్టి దినకర్‌బాబు, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు మాదరాజు గంగాధర్, సీపీఐ, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు విమర్శించారు.

లక్కిరెడ్డిపల్లె: ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, ప్రధాన కార్యదర్శి ప్రభావతి మాట్లాడుతూ మూడు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా ఓట్లు ఉన్నాయన్న విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి గుర్తు చేసుకోవాలన్నారు. పనిని బట్టి కనీస వేతనం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాలకు చెందిన అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చిట్వేలి: రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని వెంటనే రద్దు చేయాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు వైఎస్సార్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా చిట్వేలికి వచ్చిన ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కాన్వాయ్‌ని అడ్డుకున్నారు. అంగన్‌వాడీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అన్యాయమని తమ కడుపు కొట్టవద్దని విన్నవించారు. సుజాత, సుధామణి, సుజన, శ్రీదేవి, రాధ, అన్నపూర్ణ, చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: అంగన్‌వాడీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తూ తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, సీఐటీయూ నాయకులు రవికుమార్ పాల్గొన్నారు.

సుండుపల్లె: మండల కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్తలు 24 గంటల నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ సమస్య పరిష్కరించేవరకు ప్రతి రోజు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. న్యాయం చేయకపోతే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రమేశ్‌కుమార్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 6: రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రమేశ్‌కుమార్‌రెడ్డి శనివారం హైదరాబాదులో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. రాజకీయ అంశాలపై చర్చించారు.

'అధిష్ఠానం ఆదేశిస్తే పోటీ చేస్తా..'

రాజంపేట, జనవరి 6 : అధిష్ఠానం ఆదేశిస్తే రాజంపేట ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేస్తానని రాజంపేట టీడీపీ నేత పోలి వెంకటసుబ్బారెడ్డి స్పష్టంచేశారు. శనివారం రాజంపేటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను నియోజకవర్గంలో పర్యటిస్తూ పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలు ఎన్నికలు వచ్చిన రోజున జగన్‌ను డిపాజిట్ లేకుండా గద్దె దింపుతారన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే నారా చంద్రబాబు నాయుడు నాయకత్వమే శరణ్యమన్నారు. తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారన్నారు.

ప్రభుత్వ వైఫల్యమే సమ్మెకు కారణం


రాజంపేట: మున్సిపల్ కార్మికులను అడ్డుకుంటున్న పోలీసులు

రాయచోటిటౌన్, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే మున్సిపల్ కార్మికుల సమ్మెకు కారణమని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు అన్నారు. శనివారం మున్సిపల్ వర్కర్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో రాయచోటిలో పారిశుధ్య కార్మికులు భిక్షాటనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అసమర్థత కారణంగానే రాష్ట్రంలో చిరుద్యోగులు రోడ్లమీదకు వస్తున్నారన్నారు. ప్రభుత్వం మొండి పట్టుదలకు పోకుండా సమస్యలు పరిష్కరించి సమ్మె విరమణకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నేలపాటి శ్రీనివాసులు, సురేశ్‌కుమార్ మాటాడుతూ హామీలు అమలు చేయకుండా జగన్ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి బీవీ రమణ, కేశవరావు, లక్ష్మి పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో రాజంపేట మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు శనివారం కార్మికులు చేసిన యత్నాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న పోలీసులు కార్మికులను అడ్డుకొని బయటకు ఈడ్చుకెళ్లారు. అయినా, కార్మికులు లెక్కచేయకుండా కార్యాలయం లోపలికి చేరుకుని ఆందోళన చేశారు. దీంతో సీఐటీయూ నాయకులు రవి, మున్సిపల్ కార్మిక నాయకులను పోలీసులు బలవంతంగా తమ వాహనాల్లో ఎక్కించుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కొద్దిసేపటి తర్వాత విడిచిపెట్టారు.

సమాజ సేవతో దేశాభివృద్ధి

ఓబులవారిపల్లె, జనవరి 6: సమాజ సేవతో దేశాభివృద్ధి సాధ్యమని వైవీయూ కో-ఆర్డినేటర్ వెంకటరమణరెడ్డి అన్నారు. చిన్నఓరంపాడు గ్రామ పంచాయతీ అయ్యలరాజుపల్లెలోని ఎంపీపీ స్కూల్ ప్రాంగణాన్ని శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శుభ్రం చేసి, మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలోని వీధులను సైతం శుభ్రం చేశారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, శివప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఓబులవారిపల్లె, జనవరి 6: మండలంలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులకుప్రభుత్వ వైద్యుడు రాజశేఖర్ శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విజృంభిస్తున్న కరోనా మహమ్మారిని తరిమికొట్టాలంటే వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం దుర్గా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కస్తూరి

రైల్వేకోడూరు, జనవరి 6: బీసీలకు రాజ్యాధి కారం ఇచ్చింది టీడీపీ హయాంలోనే అని రైల్వే కోడూరు టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు తెలిపారు. శనివారం రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ ఏం ఉద్ధరించారని వైసీపీ నేతలు బీసీ సాధికార యాత్ర చేస్తారని విమర్శించారు. అంగన్వాడీ కార్యకర్తలపై ఎస్మా ప్రయోగం సిగ్గు మాలిన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో వేలాది మందితో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. వైసీపీ పాలనలో సర్పంచులు, ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి రాగానే పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తుందన్నారు. పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, న్యాయవాది కేజేపీ రెడ్డయ్య నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా శివ, పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యదర్శి బుంగటావుల రాజశేఖర్, మాజీ శాప్ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు బొబ్బే ధనుంజేయ, బూత్ ఇన్‌చార్జ్ దుగ్గిన ఈశ్వరయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మాజీ ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడును కనిగిరిలో కలిసి నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులు వివరించారు.పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పార్టీలో చేరుతున్నట్లు తెలియజేశారు.

గోపమాంబపురంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

రాజంపేట టౌన్, జనవరి 6 : రాజంపేట మండలం గోపమాంబపురంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గన్నె సుబ్బనరసయ్యనాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గోపమాంబపురం బూత్ కన్వీనర్ పెద్దబుద్ది నారాయణ, క్లస్టర్ మేకా వెంకటరమణ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు.

వేతనాలివ్వాలని విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

రాజంపేట, జనవరి 6: జీతాలు ఇవ్వాలని కోరుతూ విద్యుత్ శాఖలో పనిచేసే ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు రాజంపేట డివిజనల్ విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. నెలలో ఆరు రోజులు గడిచినా యాజమాన్యం ఇంత వరకు జీతాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. 327 యూనియన్ నాయకులు సత్యనారాయణశర్మ, సీఐటీయూ నాయకులు శ్రీహరి, ఏయీ ఉమాపతి, సబ్ ఇంజనీర్లు ఈశ్వర్‌రెడ్డి, శివప్రసాద్, హుస్సేన్, ఉద్యోగ సంఘ నాయకులు శ్రీధర్‌రాజు, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని లే-అవుట్లు, భవనాలపై చర్యలు

రైల్వేకోడూరు, జనవరి 6: అనుమతి లేని లే-అవుట్లు, భవనాలను తొలగించడానికి వెనకాడని కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కృష్ణ సింగ్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరు గ్రామం పంచాయతీలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు ప్రాంతంలో అనుమతి లేని భవనాలు, లే-అవుట్లను గుర్తించి, వాటికి అనుమతి తీసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 300 చదరపు మీటర్ల వరకు పంచాయతీ కార్యదర్శి వద్ద తీసుకునే సౌలభ్యం ఉందన్నారు. ఆ పైన కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వద్ద తీసుకోవాలన్నారు. రికార్డులను పరిశీలించారు.

ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు

నందలూరు, జనవరి 6 : ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితేనే తాము అనుకున్న లక్ష్యాన్ని అందుకోగలమని జిల్లా మేజర్ పంచాయతీ సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు భూమన శివశంకర్‌రెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ స్కౌట్ గ్రూపు సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్ రాజ్ ఆధ్వర్యంలో స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో సీనియర్స్, జూనియర్స్ విద్యార్థులకు సైన్స్ ఫెయిర్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు.న్యాయ నిర్ణేతలుగా కంభం జితేంద్ర కుమార్, రౌఫ్‌బాష, రాజేష్ వ్యవహరించారు.

గ్రూప్స్ అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్


మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాయచోటిటౌన్, జనవరి 6: గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ, యువకు లకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తామని టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. శనివారం ఆయన గాలి వీడు రోడ్డులోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వేదికగా ప్రతిరోజు కొత్త మెటీరియల్ అందిస్తా మన్నారు. నేటి నుండి పరీక్షలు పూర్తి అయ్యే వరకు ప్రతి రోజ యాభై ప్రశ్నలడో ప్రశ్నాపత్రాన్ని విడుదల చేస్తామన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్టీయూ మండల అధ్యక్షుడుగా నరసింహులు

రైల్వేకోడూరు, జనవరి 6: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడుగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎం. నరసింహులు శనివారం తెలిపారు. స్థానిక హెచ్ఎంఎం హైస్కూలులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శిగా కె. బాల గంగాధర్, ఆర్థిక కార్యదర్శిగా పోకూరు బాల సుబ్రహ్మణ్యంను ఎన్నుకున్నట్లు తెలిపారు. బీదం సుబ్బరాయుడు, ఎం. నరసరామిరెడ్డి, బీవీ విక్రమవర్మ, వై. రామకృష్ణ యాదవ్, మస్తాన్‌బాషా, డి. కుమార్, ఎం. అంజయ్య పాల్గొన్నారు.

శ్మశానం ఆక్రమించారని ధర్నా

రామాపురం, జనవరి 6: మండలంలోని గువ్వలచెరువు గ్రామ సర్వే నెంబరు 97లో 0-61 సెంట్ల విస్తీర్ణంలో శ్మశానం ఉంది. ఈ భూమిని ఆ గ్రామ వైసీపీ సర్పంచ్ భర్త శివయ్య ఆయన అన్నదమ్ముల పేరుతో రిజిస్టర్ చేసుకున్నారంటూ శనివారం హిందూ - ముస్లింలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గువ్వలచెరువు గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన మాదాసు పట్టాభిరామయ్యకు చెందిన ఈ భూమని 1943 మే 13న గువ్వల చెరువు గ్రామస్తులు మకాన్ నన్నుమియా, అబ్దుల్ రెహ్మాన్, పతే అహ్మద్ తదితరులు కొన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ స్థలాన్ని ముస్లింలు ఖబర్‌స్తాన్‌గా వాడుకుంటున్నారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీ గోడ కూడా నిర్మించారు. కాగా, 2023 డిసెంబరు 14న ఆ గ్రామ సర్పంచ్ భర్త శివయ్య, ఆయన సోదరులు మాదరసు సహదేవయ్య, మురళీకృష్ణ, విజయరాఘవులు, మల్లికార్జున, బండారు సుభాషిణి పేర్లతో డాక్యుమెంట్ నెంబరు 457/23లో రిజిస్టర్ చేసుకున్నట్లు గ్రామస్తులు వివరించారు.

పిల్లలకు భోజనం సక్రమంగా పెట్టకపోతే ఎలా?

పుల్లంపేట, జనవరి 6 : మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయ దం చేతకాదా... సమయానికి భోజనం పెట్టకపోతే ఎలా.. వంట సక్రమంగా చేస్తే కదా.. పిల్లలు తృప్తిగా తినేది.. ఉడికీ ఉడకని అన్నం పిల్లలకు ఎలా పెడుతున్నారని పుల్లంపేటలోని బీపీ శేషయ్య సంస్కృత పాఠశాల ఉపాధ్యాయులపై నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె మండలంలోని పలు హాస్టళ్ల పాఠశాలలను ఆమె సందర్శించారు. బీపీ శేషయ్య సంస్కృత ఉన్నత పాఠశాలలో మెనూ సక్రమంగా పాటించడం లేదని తెలుసుకొని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఎస్సీ బాలికల హాస్టల్‌లో వేడినీరు లేదని విద్యార్థులు జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. పుల్లంపేట హాస్టల్‌లో దుప్పట్లు లేవని విద్యార్థులు చెప్పడంతో వెంటనే పిల్లలకు దుప్పట్లు అందించాలని వార్డెన్‌కు సూచించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పుల్లంపేట ఎస్ఐ రఘురాం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.15 లక్షల విరాళం

సిద్దవటం, జనవరి 6 : మండలంలోని ఎస్.రాజంపేట కాలనీలో సీతారాముల ఆలయ నిర్మాణానికి రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు అతికారి కృష్ణమూర్తి శనివారం రూ. 15 లక్షల విరాళం ప్రకటించి పనులకు శ్రీకారం చుట్టారు. నాగార్జున, మస్తాన్‌బాబు, గంగాధర్ పాల్గొన్నారు.

నేడు సంజీవరాయుడికి పొంగళ్లు

పుల్లంపేట, జనవరి 6 : మండలంలోని తిప్పాయపల్లెలో ఆదివారం సంజీ వరాయుడికి పొంగళ్లు నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలోనికి మహిళలకు ప్రవేశం లేకపోగా, మగవాళ్లే పొంగళ్లు వండి నైవే ద్యం సమర్పించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ సందర్భంగా దేశవిదేశాల్లో ఉంటున్న స్థానికులు స్వగ్రామానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు.

ముత్యాల ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు పూర్తి


ముత్యాల ముగ్గుల పోటీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కొండూరు శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, జనవరి 6 : ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న ముత్యాల ముగ్గుల పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తాళ్లపాక రోడ్డులోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో మైదానాన్ని సిద్ధం చేశారు. ముగ్గులు వేయడానికి వచ్చే మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులతో పాటు, భోజన సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంటు, కార్య నిర్వాహకులు కొండూరు శరత్‌కుమార్ రాజు, శాన్వి విద్యాలయ ప్రిన్సిపాల్ విజయనిర్మలతో పాటు, శాన్వి వాకర్స్ క్లబ్ ప్రెసి డెంటు కొండూరు శరత్‌కుమార్‌రాజు, సీఈవో శంకర్‌రాజు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పలు కూరు లోకేష్, ఉగ్రవీంద్ర, సాయిరాం, ఉపాధ్యాయులు ఏర్పాట్లలో పాల్గొన్నారు. శాన్వి కళాశాలకు చెందిన వాహనాలకు ముత్యాల ముగ్గుల పోటీల బ్యానర్లు కట్టి చుట్టుపక్కల మహిళలను ఆహ్వానించారు. విజేతలకు మొదటి బహుమతిగా 6వేల రూపాయలు, రెండవ బహుమతి 4వేలు, మూడవ బహుమతిగా 3వేల రూపాయల నగదు బహుమతుతోపాటు పది ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నారు.

'విధ్వంసం నుంచి విముక్తి' బాబుతోనే సాధ్యం


మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జనవరి 6 : సైకో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసకర పాలన నుంచి రాష్ట్రాన్ని విముక్తి చేయడం కేవలం నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని రాజంపేట పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. రాజంపేట పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు 12 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించాడన్నారు. రాజధాని అభివృద్ధి , పోలవరంను పూర్తి చేయలేదన్నారు. కేవలం బటన్ నొక్కుతూ పేదలను నట్టేట ముంచాడన్నారు. సంక్షేమం పేరుతో పెట్రోలు, డీజిల్, విద్యుత్ చార్జీలు నిత్యావసరాల ధరలు భారీగా పెంచి పేదలను దోచుకున్నాడన్నారు. మాయమాటలు చెప్పి, బీసీలతో పాటు అన్ని వర్గాల వారినిముంచేశాడన్నారు. అప్పులపాలైన రాష్ట్రాన్ని గట్టెక్కించాలన్నా, దౌర్జన్యం, దుర్మార్గం నుంచి రాష్ట్రాన్ని బయటపడేయాలన్నా అది చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, మండల ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు, సర్పంచ్ కోటయ్యనాయుడు, సుబ్రమణ్యం, రామ్మోహన్ పాల్గొన్నారు.

మునిగిపోయే నావ వైసీపీ..: పంతగాని

రైల్వేకోడూరు, జనవరి 6: వైసీపీ మునిగిపోయే నావ అని రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. శనివారం రైల్వేకోడూరులో పంతగాని మాట, ఈ రోజు మాట అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు వైసీపీలో చేరిన పది రోజులకే ఓడిపోయే జట్టులో తానెందుకు ఉండాలని నిర్ణయం తీసుకుని పార్టీని వీడారని తెలిపారు. ప్రజలతో ఆడుకుంటున్న ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమం లో భాగంగా ముఖ్యమంత్రి బ్యాట్ ఎలా పెట్టి బాల్‌ను కొట్టాలో రోజాకు నేర్పించా రని తెలిపారు. వైసీపీ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై తానుఎన్నో కార్యక్రమాలు చేసినా ప్రభుత్వంలో మార్పు రాలేదన్నారు. వైసీపీని చూసి ఎమ్మెల్యేలు, ఎంపీలు భయపడుతున్నారన్నారు. వైసీపీ ప్రజల్ని మళ్లీ బురిడి కొట్టించాలని చూస్తుందన్నారు. ప్రజలు దీన్ని గమనించాలని కోరారు.

'మేడా' కు వైసీపీ టికెట్టు .. సిగ్గుచేటు!


మాట్లాడుతున్న విజయశేఖర్‌రెడ్డి

రాజంపేట, జనవరి 6 : తన పదేళ్ల పదవీ కాలంలో రాజంపేటను సర్వనాశనం చేసి, అభివృద్ధి నిరోధకుడిగా పేరొందిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి మూడవ సారి వైసీపీ టికెట్టు కేటాయించడం సిగ్గు చేటని, నియోజకవర్గ టీడీపీ నేత మేడా విజయశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. శనివారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడా మల్లికార్జునరెడ్డి తన పదేళ్ల కాలంలో రాజంపేటలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలన్నారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గ కేంద్రాన్ని జిల్లా కేంద్రం చేస్తామన్న హామీని కూడా ఎమ్మెల్యే మేడా నెరవేర్చలేకపోయాడన్నారు. జగన్ మోహన్‌రెడ్డి తన హయాంలో 11లక్షల కోట్లు అప్పులు తెస్తే.. అందులో రాజంపేటకు ఎమ్మెల్యే మేడా రూ. 10 కోట్లైనా తీసుకొచ్చారా.. అని ప్రశ్నించారు. వైసీపీ నేతల ఇసుక దోపిడీతో 40 మంది పైబడి జలసమాధి అయిన విషయం ఎవరూ మర్చిపోరన్నారు. ఇలాఅభివృద్ధినిరోధకులైన ఎమ్మెల్యే మేడా వద్ద ఉన్న అవినీతి డబ్బును తీసుకొని టికెట్టు ఇవ్వడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఎద్దల విజయసాగర్, మిట్టమీదపల్లె ఎంపీటీసీ సభ్యుడు సురేష్, తెలుగు యువత అసెంబ్లీ అధ్యక్షుడు వెంకటరమణ, తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు రాము యాదవ్, ఉపాధ్యక్షుడు చీనేపల్లి హరీష్‌కుమార్, బొజ్జిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, మైనారిటీ నాయకులు అలీ, దళిత నాయకులు వెంకి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి

రామాపురం, జనవరి 6: చంద్రబాబు నాయుడు తోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాల సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి అన్నారు. మండలంలోని కొండావాండ్లపల్లెలో శని వారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేతలకు అవినీతిపైన ఉండే శ్రద్ధ అభివృద్ధి పైన లేదన్నారు. గత ఎన్నికల్లో ఓడి పోయింది టీడీపీ కాదని ప్రజలే ఓడిపోయారన్నారు. తెలుగుదేశం పార్టీని గెలిపించేం దుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గాలివీడు మండల మాజీ ఎంపీపీ ప్రభాకర్ నాయుడు, వెంకట్రామిరెడ్డి, సుభాన్, ఇర్ఫాన్‌బాషా, మహ మ్మద్‌రఫీ, శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రామచంద్ర, కిరణ్‌కుమార్‌రెడ్డి, రేఖం ఆంజనేయులు, రేఖం శివయ్య, ఖలీల్‌బాషా, కిరణ్, నర్సారెడ్డి, నాగిరెడ్డి, శంకర్, వెంక ట్రమణ, పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్రత, సుస్థిర అభివృద్ధి బీజేపీ లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌నాయుడు

సుండుపల్లె, జనవరి 6: దేశ సమగ్రత సుస్థిత అభివృద్ధి బీజేపీ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు తెలిపారు. శనివారం సుండుపల్లె మండల కేంద్రం లోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో వికసిత భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అట్టడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని తెలియజేశారు.బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్, ఈవోపీఆర్‌డీ సురేశ్‌బాబు, కిసాన్‌మోర్చ రాయలసీమ బాధ్యుడు వెంకటరామరాజు, మండల అధ్యక్షులు సుబ్బరాజు, జిల్లా కోఆర్డినేటరు ఆదినారాయణ, నాగరాజు, సుబ్బరామరాజు, గోపాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా శ్రీరామ అక్షింతల పంపిణీ

రామాపురం, జనవరి 6: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీలో శనివారం ఇంటింటా పంపిణీ చేసినట్లు విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు అంజనారెడ్డి, మండల అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 22న రామాలయం ప్రారంభం కానున్న సందర్భంగా రామాపురం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని ప్రతి ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వేకోడూరు: మండలం లో ప్రతి ఇంటికి అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ చేస్తున్నట్లు రైల్వేకోడూరు విశ్వహిందూ పరిషత్ నాయకులు దరిశా వెంకటరెడ్డి తెలిపారు. శనివారం మాధవరంపోడులో అక్షింతలు పంపిణీ చేశారు. ప్రత్యేక రథంపై రామయ్యను ఊరేగించారు.

అట్టహాసంగా శోభాయాత్ర

నందలూరు, జనవరి 6: అయోధ్యలో జనవరి 22న జరగబోవు శ్రీరామచంద్రుల విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకొని శనివారం నాగిరెడ్డిపల్లెలోని మారెమ్మ ఆలయం నుంచి ఒంటిమిట్ట కోదండరామాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. జన జాగృత సంఘం ఆధ్వర్యంలో తిరుపతి ఇస్కాన్ టెంపుల్ స్వామీజీలు యాత్రను ప్రారంభించారు. బస్టాండు వద్ద ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. ఒంటిమిట కోదండరామాలయంలో ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. టీటీడీ అన్నప్రసాదం పంపిణీ చేసింది. గోపినేని హిమగిరినాథ్ యాదవ్, బూసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చలపాటి నరసింహశెట్టి, ఆర్ముగం విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

శాన్వి వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

రాజంపేట, జనవరి 6: సంక్రాంతి సందర్భంగా శాన్వి వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో మహిళలకు చీరలు, పురుషులకు పంచెలు అందజేశారు. వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడు కొండూరు శరత్‌కుమార్‌రాజు, వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు కొండూరు భరత్‌కుమార్‌రాజు, రాజంపేట వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు సుబ్బరామరాజు, పెంచలయ్య, సుధీర్, శంకర్‌రాజు, విజయనిర్మల పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో ఆటోడ్రైవర్ కిడ్నాప్

దాడి చేసి, బలవంతంగా బస్సులోకి తోసి.. విజయవాడకు పయనమైన అయ్యప్ప భక్తులు

అడ్డుకుని, బాధితుడిని విడిపించిన పోలీసులు

శ్రీకాళహస్తిలో కలకలం సృష్టించిన ఘటన

శ్రీకాళహస్తి జనవరి 6: ఓ ఆటోడ్రైవర్‌పై అయ్యప్ప భక్తులు దాడి చేసి, బలవంతంగా బస్సులోకి తోసి.. సినీ ఫక్కీలో కిడ్నాప్ చేశారు. ఈ ఘటన తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో కలకలం సృష్టించింది. స్థానికులు పోలీసులు అడ్డుకుని, బాధితుడిని విడిపించి 14 మందిపై కేసు నమోదు చేశారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి మండలానికి చెందిన ధర్మేంద్ర శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. మచిలీపట్నానికి చెందిన కొందరు భక్తులు శబరిమల యాత్రకు వెళ్లారు. దీక్ష విరమించాక తిరుగు ప్రయాణంలో శ్రీకాళహస్తికి శుక్రవారం రాత్రి చేరుకున్నారు. ముక్కంటి ఆలయ దర్శనానంతరం టూరిస్టు బస్టాండు వద్ద మరో బస్సులోని భక్తులతో మాటామాటా పెరగడంతో వాగ్వాదానికి దిగారు. దీన్ని గమనించిన ఆటో డ్రైవర్ ధర్మేంద్ర వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో మచిలీపట్నానికి చెందిన అయ్యప్ప భక్తులు ఆటో డ్రైవర్‌ని దుర్భాషలాడారు. ఆగ్రహించిన ఆటోడ్రైవర్ దగ్గరలోని కొబ్బరిబోండాలు కొట్టే కత్తితో బస్సు అద్దంపై దాడిచేశాడు. అద్దం ధ్వంసమవడంతో ఆ వాహన డ్రైవర్ విజయవాడకు చెందిన బస్సు యజమానికి ఫోన్‌ద్వారా విషయం తెలిపాడు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ అయ్యప్ప భక్తులు వెంటనే ఆటో డ్రైవర్‌పై దాడి చేశారు. బలవంతంగా బస్సులోకి తోశారు. అక్కడున్న స్థానికులు గమనించి బస్సును అడ్డుకున్నారు. అందుకువారు స్థానిక పోలీస్ స్టేషన్‌కె వెళ్లి ఫిర్యాదు చేస్తామని, నమ్మించి బస్సు లో విజయవాడకు బయల్దేరారు. విషయాన్ని అప్పటికే కొందరు స్థానికులు 100కు ఫోన్‌చేసి.. పోలీసులకు తెలియజేశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక కూడా ఎంతసేపటికీ బస్సు పోలీస్‌స్టేషన్ వద్దకు రాకపోవడంతో వన్‌టౌన్ సీఐ అంజుయాదవ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. బస్సు నెంబరు ద్వారా పోలీసులు సంబంధిత వాహన యజమాని వివరాలు గుర్తించి, ఫోన్లో సంప్రదించారు. 'ఆటో డ్రైవర్‌ను వదిలే ప్రసక్తే లేదు.. ఏం చేస్తారో చేసుకోండి. నేను అధికార పార్టీ నాయకుడిని' అంటూ ఆ యజమానికి పోలీసులకు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత ఆటోడ్రైవర్ సెల్‌ఫోన్ ఆధారంగా బస్సు.. పొదలకూరు వద్ద వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే అక్కడి పోలీసులను అప్రమత్తం చేసి ఆ బస్సును అడ్డుకున్నారు. అనంతరం శ్రీకాళహస్తి పోలీసులు పొదలకూరు చేరుకుని, ధర్మేంద్రను విడిపించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం శనివారం వేకువజామున శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయ్యప్ప భక్తులతోసహా బస్సును శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు కాకుండా కొందరు అధికార పార్టీ నేతలు ఫోన్ల ద్వారా అధికారులపై ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అయినా 14మందిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి.. బస్సును ఆర్టీసీ బస్టాండ్ గ్యారేజ్‌లో పెట్టారు.


చికిత్స పొందుతున్న ధర్మేంద్ర

చంద్రబాబు ఇంటికి సంక్రాంతి ముస్తాబు


నారావారిపల్లెలో ముస్తాబవుతున్న చంద్రబాబు ఇల్లు

చంద్రగిరి, జనవరి 6: మాజీ సీఎం చంద్రబాబు తన కుటుంబీకులతో కలిసి సంక్రాంతి పండగకు స్వగ్రామమైన నారావారిపల్లెకు రావడం ఆనవాయితీ. వీరితోపాటు నందమూరి కుటుంబీకులు కూడా వస్తున్న విషయం తెలిసిందే. దాంతో నారావారిపల్లెలోని ఆయన ఇంటిని ముస్తాబు చేస్తున్నారు. ఇంటికి పెయింటింగ్ వేసి, ఆవరణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దుతున్నారు. చంద్రబాబు తల్లిదండ్రుల సమాధులు, కులదైవం నాగాలమ్మ ఆలయం, గ్రామ దేవతల వద్ద పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. పార్కింగ్, భద్రతా సిబ్బంది ఉండటానికి టీటీడీ కళ్యాణ మండపంలో పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా టీటీడీ కళ్యాణమండపం, అతిథిగృహాన్ని ముందుగా బుక్ చేశారు.

మీ చీర వద్దంటే పెన్షన్ తీసేస్తారా!

- సర్దార్ మృతికి ఎమ్మెల్సీ భరత్‌దే బాధ్యత
- టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు ఖాదర్‌బాషా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

కుప్పం, జనవరి 6: ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభపెడుతూ చీరలు తాయిలాలుగా పంచడమేకాక, ఆ చీరను వద్దన్న వారికి పెన్షన్ తీసేస్తారా? అని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా వైసీపీ నేతలను నిలదీశారు. తనమాట వినలేదన్న కారణంతో పెన్షన్ కట్ చేసి సర్దార్ మృతికి ఎమ్మెల్సీ భరత్ బాధ్యులయ్యారని ఆరోపించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లగా వస్తున్న పెన్షన్‌ను వైసీపీ నాయకుల మాటలు వినలేదన్న కారణంతో హఠాత్తుగా కట్ చేసి ఆయన బాధతో గుండె పోటుకు గురై మరణించడానికి కారణమయ్యారన్నారు. కుప్పం ప్రజలు రెండు నెలల్లో రాబోయే ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాలకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ విభాడగం నియోజకవర్గ అధ్యక్షుడు జాకిర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి రఫీక్‌లు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం


ధ్వంసమైన కొబ్బరిచెట్టు

కల్లూరు, జనవరి 6: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లి సమీపంలోని పంటలను శుక్రవారం రాత్రి ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. చంద్రబాబుకు చెంది న మిరప, అలసంద పంటలను ధ్వంసం చేసిన ఏనుగులు కొబ్బరిచెట్లను విరిచేశాయి. ఇదే గ్రామానికి చెందిన ధర్మేంద్ర, మల్లికార్జున, కృష్ణయ్య మామిడిచెట్లను విరిచేశాయి. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

అధికారంలోకి రాగానే 'సూపర్ సిక్స్' అమలు

- మాజీ మంత్రి అమరనాథరెడ్డి


మాట్లాడుతున్న అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, జనవరి 6: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయనున్నట్లు మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. నాలుగున్నరేళ్ల వైసీపీ అరాచక పాలనకు స్వస్తిపలికి మన రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తున్న ఆయన నాగిరెడ్డిపల్లెలో మీడియాతో మాట్లాడుతూ జగన్ అనాలోచిత నిర్ణయాలవల్ల భావి తరాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మరోసారి వైసీపీకి అవకాశం కల్పిస్తే ప్రజల ఆస్తులు కూడా పోగొట్టుకునే దుస్థితి ఏర్పడుతుందన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయంపై వారిలో చైతన్యం కల్పించేందుకు జయహో బీసీ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

72 మంది టీడీపీ నేతలకు స్టేషన్ బెయిల్


నోటీసులు తీసుకున్న టీడీపీ నేతలు

శాంతిపురం, జనవరి 6: అరెస్టు అయిన 72 మంది టీడీపీ నేతలకు శనివారం స్టేషన్ బెయిల్ మంజూరైంది. ఆ నేతలకు రాళ్ళబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో 41 నోటీసులు ఇచ్చి సంతకాలు తీసుకున్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు అరెస్టుకు నిరసనగా గత సంవత్సరం సెప్టెంబరు 10న శాంతిపురంలో టీడీపీ నేతలు ధర్నా చేపట్టి, బంద్ చేశారు. అప్పుడు హెడ్ కానిస్టేబుల్ పరమేశు విధులకు ఆటంకం కలిగించారని ఫిర్యాదు మేరకు రాళ్ళబూదుగూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ కేసుకు సంబంధించి పోలీసులు 41 నోటీసులు ఇచ్చారు.

భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు

చౌడేపల్లె,జనవరి6: తన భర్త మృతి అనుమానాస్పదమని ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు ఏఎస్‌ఐ వాసు పేర్కొన్నారు. శనివారం అయన మాట్లాడుతూ స్థానిక నాయునివారి పాళ్యంలో నివాసమున్న విశ్రాంతి జవాన్ సి.మురళి(38)కి, పెద్దపంజాణి మండలానికి చెందిన సంపూర్ణతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. మురళి మిలటరీలో పని చేస్తూ కొంతకాలం కిందటే రిటైర్ అయ్యారు. ఈ క్రమంలో భార్య భర్తలు మనస్పర్థలతో కొన్ని సంవత్సరాలుగా విడిగా ఉంటున్నారు. మురళి నాయునివారిపాళ్యంలో తల్లిదండ్రులతో కలిసి ఉండగా భార్య సంపూర్ణ పంజాణి మండలంలో విడిగా ఉంటోంది. ఈ క్రమంలో మురళి శనివారం ఉరేసుకుని మృతి చెందాడని కుటుంబీకులు సంపూర్ణకు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. వెంటనే ఆమె చౌడేపల్లెకు చేరుకుని భర్త మృతదేహాన్ని పరిశీలించి తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులుకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ వాసు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్రాంతికి 233 అదనపు బస్సులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 6: సంక్రాంతిని పురస్కరించుకుని ప్రధాన నగరాలకు అదనంగా 233 ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చెంగల్‌రెడ్డి తెలిపారు. ● 10, 11, 12 తేదీల్లో హైదరాబాదుకు 15, బెంగళూరుకు 40, చెన్నైకి 17, విజయవాడకు 11, ఇతర మార్గాలకు 55 ● 15, 16, 17 తేదీల్లో హైదరాబాదుకు 16, బెంగళూరుకు 1, చెన్నైకి 16, విజయవాడకు 8, ఇతర మార్గాలకు 10 బస్సుల చొప్పున ఉన్నాయి.

బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలి

- సెక్టోరల్ అధికారులకు డీఆర్వో రాజశేఖర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 6: సార్వత్రిక ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో సెక్టోరల్ అధికారుల పాత్ర అధికంగా ఉంటుందని డీఆర్వో రాజశేఖర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఆర్డీవోలు, మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్, సెక్టోరల్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై ఒక్కరోజు శిక్షణా తరగతులు జరిగాయి. శిక్షణా తరగతులను ప్రారంభించిన డీఆర్వో మాట్లాడుతూ ఈనెల 22న ఓటర్ల తుదిజాబితా విడుదల చేస్తామని చెప్పారు. సెక్టోరల్ అధికారులు, బీఎల్వోలు ఎన్నికల నిబంధనలను అనుసరించి బాధ్యతలు నిర్వహించాలని అన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు బీఎల్వోల పాత్ర అత్యంత ప్రాధాన్యమైనదని తెలిపారు. సెక్టోరల్ అధికారులు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మ్యాపింగ్ చేసుకుని కమ్యూనికేషన్ వ్యవస్థ, పోలీసులతో కలిపి శాంతిభద్రతల నివేదిక తయారుచేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక భద్రతకోసం నివేదికలు అందించాలన్నారు. ఈవీఎంల పట్ల అవగాహన పెంచేందుకు, మరింత పోలింగ్‌శాతం పెంచేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరి ఆర్డీవో సృజన, చిత్తూరు ఏఎస్వో సుందర్‌రాజన్‌లు శిక్షణ ఇవ్వగా, ఆర్డీవోలు మనోజ్ కుమార్ రెడ్డి (పలమనేరు), శ్రీనివాసులు (కుప్పం), ఎన్నికల సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తప్పుకదా గోవిందా..!

అధికార పార్టీ స్టిక్కర్‌తో తిరుమలకు వచ్చిన కారు



మఠం ముందు అధికార పార్టీ స్టిక్కర్‌తో కారు

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ వైసీపీ స్టిక్కర్‌తో ఉన్న కారు శనివారం తిరుమలలో కనిపించింది. సాధారణంగా రాజకీయ పార్టీ జెండాలు, గుర్తులు, వ్యక్తుల ఫొటోలతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి తనిఖీల్లోనే భద్రతా సిబ్బంది గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. అయితే ఏపీ 02 ఏపీ 3699 నెంబరు గల కారుపై సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో కూడిన స్టిక్కర్‌ను ఉంచి తిరుమలకు తీసుకువచ్చారు. కారును తిరుమలలోని పరకాలస్వామి మఠం వద్ద పార్కింగ్ చేసి వెళ్లారు. నిబంధనలను ఉల్లఘించినా టీటీడీ భద్రతా సిబ్బంది మాత్రం ప్రశ్నించకుండా మౌనంగా ఉండిపోవడం గమనార్హం. ఈ ఘటనతో అలిపిరిలో తనిఖీలపై కూడా విమర్శలు వచ్చాయి.

తిరుమల ఘాట్‌లో లారీ బోల్తా


ప్రమాదానికి గురైన లారీ - గాయపడిన డ్రైవర్ శంకర్

తిరుమల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్‌లో శనివారం ఓ లారీ బోల్తా పడింది. వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లలో భాగంగా సెట్టింగు కోసం వినియోగించిన వస్తువులను ఏపీ 03డీ 7625 నెంబరు మినీ లారీలో ఎక్కించి తిరుపతికి బయల్దేరారు. 26వ మలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. డ్రైవర్ తిరుపతికి చెందిన శంకర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

నేరాల అదుపునకు కృషి చేయాలి

తంబళ్లపల్లె, జనవరి 6: నేరాల అదుపునకు కృషి చేయాలని డీఎస్పీ కేశప్ప సూచించారు. శనివారం తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించడంతో పాటు సిబ్బంది పనితీరు, కేసుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .సంక్రాంతి సందర్భంగా గ్రామాలలో కోడిపందేలు, పేకాట, జూదం వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున సమస్యాత్మక గ్రామాలు, రౌడీ షీటర్ల పట్ల ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి, ఏఎస్‌ఐ రెడ్డప్ప నాయక్, హెడ్‌కానిస్టేబుళ్లు శంకర, రవినాయక్ సిబ్బంది ఉన్నారు.

వాహనం సహా ఎర్రదుంగలు స్వాధీనం

పీలేరు, జనవరి 6: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనంతో సహా 10 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో సుబ్బారెడ్డి తెలిపారు. తమకు అందిన రహస్య సమాచారం మేరకు శనివారం పీలేరు క్రాస్ నుంచి వేగంగా వచ్చిన ఏపీ39 క్యూ 0497 కారును తనిఖీ చేయగా అందులో 370 కేజీలు బరువున్న 10 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. దీంతో కారుతో సహా వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. కారులోని ఇద్దరు వ్యక్తులు తమను చూసి దానిని వదిలి పారిపోయారన్నారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్‌వో వెంకటరమణ, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

వివాహిత ఆత్మహత్య

మదనపల్లె టౌన్, జనవరి 6:కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మదనపల్లె చంద్రకాలనీకి చెందిన వెంకటరమణ భార్య దీపిక(24)ల మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలున్నాయి. కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన దీపిక జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మదనపల్లె టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో పది మందిపై కేసు

మదనపల్లె టౌన్, జనవరి 6: దళితులను అడ్డగించి దౌర్జన్యం చేసిన కేసులో పదిమందిపై మదనపల్లె తాలూకా పోలీసులు కేసులు నమోదు చేశారు. తాలూకా సీఐ శేఖర్ వివరాల మేరకు..మదనపల్లె మండలం సీటీఎం-2 పంచాయతీ చిలకవారిపల్లెకు చెందిన భద్రప్ప కుమారుడు భానుప్రసాద్, అతని బాబాయి వెంకటరమణ శుక్రవారం రాత్రి చిలకవారిపల్లె దళితవాడ వద్ద వేసిన చిట్లాకుప్ప వద్దకు వెళ్లి తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో చిట్లాకుప్ప వేయొద్దని అభ్యంతరం తెలిపారు. దీంతో ఇదే గ్రామానికి చెందిన పది మంది బీసీలు వారిద్దరిని అడ్డగించి దౌర్జన్యం చేశారని బాధితులు శనివారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించిన సీఐ పది మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు దౌర్జన్యం సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

సర్పంచ్ అక్రమాలపై చర్యలు తీసుకోండి

బికొత్తకోట జనవరి 6 : మండలంలోని గుమ్మసముద్రం సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు ఎంపీడీవో శంకరయ్యకు వినతి పత్రం అందచేశారు. గుమ్మసముద్రం అభివృద్ధిని సర్పంచ్ అడ్డుకుంటున్నారని, గండువారిపల్లె, బుచ్చిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రెజల్యూషన్ ఇవ్వలేదన్నారు. తాగునీటి పథకాలు, వీధి దీపాలు, పైప్‌లైన్లు తదితర అభివృద్ధి పనుల్లో అవకతవకలపై విచారణ చేయాలని వారు ఫిర్యాదులో కోరారు. వార్డు సభ్యులు రెడ్డెప్ప, వెంకట్రమణ, అక్కులమ్మ, జయసింహా, సుమలతా, ఉషారాణి, నరసింహులు, బి.రవి తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుర్రంకొండ, జనవరి 6:ఆటోను ఐచర్ వాహనం ఢీకొనడంతో ఇద్దరికి రక్తగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన నరసింహులు(50), తల్లి లక్ష్మీదేవి(70)తో కలిసి శనివారం రెడ్డెమ్మకొండ ఆలయానికి ఆటలో వచ్చి వెళుతుండగా మదనపల్లె నుంచి గుర్రంకొండ వైపు వస్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మీదేవి, నరసింహులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

కలకడ, జనవరి 6:అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సుధాకర్‌ను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. కదిరాయచెరువు గ్రామానికి చెందిన అతని నుంచి 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది మహబూబ్‌బాష, యూనస్ పాల్గొన్నారు.

వైసీపీ నిరంకుశ విధానాలపై పోరాడాలి



బి.కొత్తకోటలో నోటికి గడ్డి కరుచుకొని అంగన్వాడీల నిరసన



తంబళ్లపల్లెలో నిరసన

మదనపల్లె టౌన్, జనవరి 6: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంఖుశ విధానాలపై ప్రతి ఒక్కరు పోరాటం చేయాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 26వ రోజు సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ మధ్యాహ్న బోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ అంగన్వాడీలను అణచి వేసేందుకు ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని తీసుకొస్తామని చెప్పడం అటవిక పాలనను తలపిస్తోందన్నారు. 26 రోజులుగా శాంతియుత నిరసనలు తెలుపుతున్న అంగన్వాడీలపై ఉక్కుపాదం మోపి అణగదొక్కాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి అంగన్వాడీలు సమ్మె చేస్తుంటే వాటిని పరిష్కరించకుండా సమ్మె కాలంలో వేతనం నిలిపివేస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు. టీడీపీ సీనియర్ నేత మార్పురి సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబునాయుడు అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వై.దొరస్వామి నాయుడు, అన్వర్‌బాషా, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జీవోలకు అదరం..బెదరం

అంగన్వాడీల నిరవదిక సమ్మెను అణగదొక్కాలని ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం: 2ను చూసి అదరం..బెదరమని అంగన్వాడీలు ఆగ్రహించారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని తీసుకొచ్చి న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే నిషేదం విధించడం అప్రజాస్వామ్యమన్నారు. అంగన్వాడీల సమ్మెకు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకురాళ్లు మధురవాణి, గంగాదేవి, మంజుల, కుసుమ, అఖీరున్నీసా పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: అంగన్వాడీ కార్యకర్తలను ఉద్యోగాల నుంచి తొలగించే ప్రయత్నం చేసినా వైసీపీ ప్రభుత్వానికి చేటు తప్పదని అంగన్వాడీ యూనియన్ లీడర్లు హెచ్చరించారు. శనివారం వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం వద్ద ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు నల్ల బెలూన్లు చేతపట్టి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ఉద్యోగాలు ఎలా తీస్తారో చూస్తామన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా అవసరం అయితే కోర్టులకు కూడా వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రా వతి, భూకైలేశ్వరి, ప్రసన్న, అమ్మాజీ, లక్ష్మీనరసమ్మ, దేవసేన, రెడ్డిరాణి, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ, మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

జీతాలు పెంచకపోతే.... గడ్డి తిని బతకాలా

బి.కొత్తకోట జనవరి 6 : ప్రభుత్వం జీతాలు పెంచక పోతే నామమాత్రపు గౌరవ వేతనంతో గడ్డి తిని బ్రతకాలా...అని అంగన్వాడీ యూనియన్ నేతలు మండిపడ్డారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం బి.కొత్తకోట ఐసీడీస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు, చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 26వ రోజుకు చేరింది. ఈసందర్భంగా యూనియన్ లీడర్లు శ్రీవాణి, చాంద్‌బీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించక పోగా, విధుల్లో చేరక పోతే ఎస్మా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామంటూ బెదిరించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ఎంత వేదించినా వెనక్కు తగ్గేది లేదన్నారు. కార్యక్రమంలో ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట మండలాలకు చెందిన కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారానికి 26వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీలు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో బైఠాయించి రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాళ్లు మాట్లాడు తూ...సీఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

మదనపల్లె అర్బన్, జనవ రి 6: తెలుగేదేశం పార్టీ అధికారంలోకి రావాలని, నారాచంద్రబాబునాయు డు మళ్లీ సీఎం కావాలని తంబళ్లపల్లె నియోజకవ ర్గం టీడీపీ నాయకుడు కట్టా దొరస్వామినాయుడు ఆధ్వ ర్యంలో దశమహావిద్య సమేత మహారాజ శ్యామల చండీహోమం నిర్వహించారు. మదనపల్లె పట్టణంలోని ఎన్‌వీఆర్ కళ్యాణమండపం శనివారం ప్రారంభమైన ఈ హోమం మూడు రోజులపాటు నిర్వహిం చనున్నట్లు ఆయన తెలిపారు. తొలిరోజు రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు పి. సురేంద్రయాదవ్, రాష్ట్రఅధికారప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, పార్ల మెంట్ జనరల్ సెక్రటరీ దొరస్వామినాయుడు, టీడీపీ నాయకులు ఆర్‌జే వెంకటేష్, నాదేళ్లవిద్యాసాగర్, భవానీప్రసాద్, నాగూర్‌వలి, పఠాన్‌ఖాదర్‌ఖాన్, రాటకొండ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

మదనపల్లె, జనవరి 6: ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జనసేన రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి అన్నారు. శనివారం మదనపల్లె మండలం పప్పిరెడ్డిగారిపల్లెలో 15,16 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల అధికారులు ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గంగారపు రాందాస్ చౌదరి జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరాం, రాష్ట్ర చేనేత విభాగ ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, పట్టణ అధ్యక్షుడు జగదీష్, రూరల్ అధ్యక్షుడు గ్రానైట్ బాబు, కళ్యాణ్, చం ద్రశేఖర్, కుమార్, గౌతం, లోకేష్, మోహన్ పాల్గొన్నారు.

వృత్తిపట్ల బాధ్యత అవసరం

కలికిరి, జనవరి 6: వృత్తి పట్ల ఉపాధ్యాయులకు సామాజిక బాధ్యత అవసరమని మండల పూర్వ ఎంఈవో రంగనాథ రెడ్డి పేర్కొన్నారు. . మండలంలో పనిచేస్తూ ఇటీవలే బదిలీపై వెళ్లి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన రంగానాథ రెడ్డిని స్థానిక ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు.

అధునాతన వసతులతో రాధాకృష్ణ టెక్స్‌టైల్ షోరూం ప్రారంభం



టెక్స్‌టైల్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న యజమాని, మదనపల్లె తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు ఉప్పరామచంద్ర

మదనపల్లె అర్బన్, జనవరి 6: అదునాతనమైన వసతులతో శనివారం స్థానిక నీరుగట్టువారిపల్లెలో రాధాకృష్ణ టెక్స్‌టైల్ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు, మదనపల్లె తొగటవీరక్షత్రియసంఘం అధ్యక్షుడు ఉప్పరామచంద్ర మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని నూతన డిజైన్లతో, వివిధ రకాల వస్త్రాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇందులో ముఖ్యంగా కంచిపట్టు, రాశిపట్టు,ధర్మవరం, పడియా, మాంగళ్యపట్టు ప్రత్యేకత అని చెప్పారు. పురుషులకు, మహిళలకు, పిల్లలకు అన్ని నూతన డిజైన్స్‌లో వస్త్రాలు లభిస్తాయన్నారు. న్యూఇయర్, సంక్రాంతి పండుగల సందర్భంగా ఆఫర్లు ఇస్తున్నామన్నారు. ప్రతి రూ.2 వేలకు వస్త్రాలు కొంటే ఉచితంగా రెండు వెండినాణెములు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రామచంద్ర కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో మడకశిర ఎంఈవో అరెస్ట్

తంబళ్లపల్లె, జనవరి 6: సచివాలయ ఉద్యోగాల పేరిట నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు సృష్టించి నిరుద్యోగులను చీటింగ్ చేసిన కేసులో సత్య సాయి జిల్లా మడకశిర ఎంఈవోను తంబళ్లపల్లె పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ లోకేష్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు...2021లో సత్య సాయి జిల్లాకు చెందిన లక్ష్మీదేవి(ఏ1), మరొక వ్యక్తి(ఏ2), మడకశిర ఎంఈవో శ్రీనివాసులు(ఏ3) సచివాలయంలో ఉద్యోగాల పేరిట నకిలీ అపాయింట్మెంట్ లెటర్లు సృష్టించి నిరుద్యోగులకు ఇచ్చి మోసం చేశారన్నారు. అదే సంవత్సరంలో తంబళ్లపల్లె మండలంలో సచివాలయ ఉద్యోగిగా విధుల్లో చేరడానికి ఓ యువతి, తన మామతో కలసి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్‌తో తంబళ్లపల్లె ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిందన్నారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్ చూసిన ఎంపీడీవోకు అనుమానం వచ్చి ఆరాతీయగా అది ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ అని గుర్తించి తంబళ్లపల్లె పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఎంపీడీవో ఫిర్యాదుతో చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, ఈ కేసులో ఏ1, ఏ2 నిందితులను ఇదివరకే అరెస్టు చేయగా శనివారం ఏ3 నిందితుడిగా ఉన్న మడకశిర ఎంఈవోను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెంచిన పెన్షన్లు పంపిణీ

రామసముద్రం, జనవరి 6: వృద్ధులకు పెంచిన పెన్షన్‌ను శనివారం స్థానిక ఎమ్మెల్యే నవాజ్‌బాషా పంపిణీ చేశారు. కాగా రామసముద్రం మండలంలో మొత్తం 6640మంది వృద్ధాప్య పెన్షన్‌లు ఉన్నట్లు ఎంపీడీవో నారాయణస్వామి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సామాజిక పింఛన్లను మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ శనివారం పట్టణంలోని 23, 28 వార్డులో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ముబీనా, ప్రసాదబాబు, గిరిజా, రజని పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: స్థానిక పంచాయతి కార్యాలయంలో అర్హులైన 5241మందికి మూడు వేలరూపాయల చొప్పున ఫించన్‌లను ఎమ్మెల్యే నవాజ్‌బాషా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషాద్రి, తహసీల్దార్ మంజుల సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ ఎన్‌సీసీ విద్యార్థుల ధ్యేయం

మదనపల్లె అర్బన్, జనవరి 6: ఐక్యత, క్రమశిక్షణ ఎన్‌సీసీ విద్యార్థుల ధ్యేయమని స్థానిక జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం జడ్పీహైస్కూల్‌లో ఎన్‌సీసీ, ఆర్మీ విభాగానికి చెందిన విద్యార్థినులకు డ్రిల్, మ్యాప్‌రీడింగ్, వెపన్ ట్రైనింగ్, అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఎన్‌సీసీ అధికారులు దేవకమ్మ, ఈశ్వరమమ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి కల్యాణం

గుర్రంకొండ, జనవరి 6:గుర్రంకొండ మండలం తరిగొండలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి శ్రీదేవి, భూదేవిలతో కల్యాణోత్సవాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు.

సంక్రాంతి కోసం యూటీఎఫ్ క్రికెట్ టోర్నీ

పీలేరు, జనవరి 6: సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని యువ ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు యూటీఎఫ్ నాయకులు మొరవపల్లెలో క్రికెట్ టోర్నీ ఏర్పాటు చేశారు. ఐదు రోజులపాటు జరిగే ఈ టోర్నీని శనివారం యూటీఎఫ్ జిల్లా నాయకులు రాధాకృష్ణ, శివారెడ్డి, అక్రమ్ బాషా ప్రారంభించారు.

'రా...కదిలిరా'తో వైసీపీలో వణుకు పుడుతోంది

● పీలేరు టీడీపీ నేతలు ● 24న చంద్రబాబు బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న పీలేరు టీడీపీ నాయకులు

పీలేరు, జనవరి 6: టీడీపీ, జనసేన ఉమ్మడిగా చేపట్టిన 'రా...కదిలిరా' కార్యక్రమం ద్వారా వైసీపీకి వణుకుతోపాటు ఆపార్టీ పునాదులు కదులుతున్నాయని పీలేరు టీడీపీ నేతలు పేర్కొన్నారు. పీలేరులోని పార్టీ కార్యాలయంలో శనివారం వారు విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి మాట్లాడుతూ 'తెలుగుదేశం పిలుస్తోంది, రా...కదిలిరా' అన్న నినాదంతో 1983లో స్వర్గీయ ఎన్టీఆర్ కాంగ్రెస్ పార్టీ, ఢిల్లీ పెత్తనానికి స్వస్తి పలికారని గుర్తు చేశారు. మళ్లీ అదే నినాదంతో ప్రస్తుతం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ చేపట్టిన 'రా...కదిలిరా' కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అరాచక వైసీపీ పాలనను అంతమొందిస్తారని తెలిపారు. అందుకు ఇటీవల ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలే సాక్ష్యమన్నారు. ఈ నెల 24న పీలేరులో చంద్రబాబు నాయుడు బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి ఈ నెల 24న పీలేరులో జరిగే చంద్రబాబు బహిరంగ సభలో రాజంపేట పార్లమెంటు పరిధిలోని ప్రతి టీడీపీ సభ్యుడు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర బీసీ సాధికార కమిటీ కార్యదర్శి పురం రామ్మూర్తి, నాయకులు అమరనాథరెడ్డి, లక్ష్మీకర, కంచి సూరి, మట్టి వెంకటరమణారెడ్డి, రహంతుల్లా, హనీఫ్, కేజీఎన్ రెడ్డిబాషా, సుబ్బయ్య, ఖాజాపీర్, గాండ్ల విజయ్ కుమార్, రెడ్డిముని, కప్పరం చంద్రయ్య, షామియాన జయన్న, సుభాష్, వెంకటరమణ నాయక్, మహమ్మద్ పీర్, ఫర్హత్ పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాల కల్పనలో ప్రభుత్వం విఫలం

కురబలకోట, జనవరి 6: యువతకు ఉద్యోగాల కల్పనలో వైసీపీ ప్రభు త్వం పూర్తిగా విఫలమైందని రాజం పేట పార్లమెంటరీ తెలుగుయువత ప్రధానకార్యదర్శి అయూబ్ బాషా పేర్కొన్నారు. శనివారం మండలం లోని అంగళ్లులో విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ యువతను లన్ని విధాలా మోసం చేసిన జగన్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. అధికారంలోకి రాకముందు ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ పేరుతో లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక యువతను పూర్తిగా విస్మరించి వారి భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టారన్నారు. రానున్న ఎన్నికల్లో యువత పార్టీలకతీతంగా టీడీపీకి మద్ధతు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు బావాజాన్, ప్రబాకర్, మోహన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ద్రోహం చేసిన జగన్‌కు బుద్ధిచెప్పాలి



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి

మదనపల్లె టౌన్, జనవరి 6: రాష్ట్రంలో బీసీలకు 100 సీట్లు ఇస్తామని చెప్పి వారికి నమ్మకద్రోహం చేసిన సీఎం జగన్‌కు బీసీలే బుద్ధిచెప్పాలని టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి వెంకట రమణా రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మదనపల్లె ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేశ్ ఆదేశాలతో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయా త్రలో నారా లోకేశ్ బీసీలు ఎదుర్కొంటున్న కష్టాలను స్వయంగా చూశారని అందుకే టీడీపీ అధికారంలోకి వస్తూనే బీసీల రక్షణకు చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారన్నారు. చంద్రబాబు చేపట్టిన రా..కదలిరా.. కార్యాక్ర మానికి వస్తున్న స్పందన చూసి తాడేపల్లె ప్యాలెస్‌లో వణుకు పుడుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీతయ్య, మల్లికార్జున, శ్రీనివాసులు, దుర్గాప్రసాద్, సికిందర్, దాదాపీర్, బావాజాన్, అయూబ్, రమేష్, మోహన, రాజారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ సభ్యుల ప్రమాణస్వీకారం



మదనపల్లె అర్బన్, జనవరి 6: మదనపల్లె వాసవీక్లబ్ నూతన కార్యవ ర్గం స్థానిక ఆర్య వైశ్య హాస్టల్‌లో శనివారం ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడుగా అంక్కిశెట్టిశ్రీనాథ్, కార్యదర్శిగా పి.అమరనాథ్, ట్రెజరర్‌గా పి.లక్ష్మీదీపక్, 30మందితో కూడిన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథిగా వాసవీ ఇంటర్నేషనల్ సెక్రటరీ డాక్టర్ హెచ్‌ఎస్ నాగభూషణం వారితో ప్రమాణ స్వీకా రం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటైన వాసవీక్లబ్ ఆధ్వర్యంలో రక్తదా న శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రసాద్, అనిల్, నాగరాజ, వివికృష్ణారావు, గిరిధ ర్, మునిరాజ, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, కార్తీక్, విజయ్‌కుమార్, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

లక్కీడిప్ ద్వారా 46 మంది లబ్ధిదారుల ఎంపిక



లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న రెవెన్యూ అధికారులు

పీలేరు, జనవరి 6: పీలేరు పట్టణ జగనన్న కాలనీ ఏపీఐఐసీ 4వ లే-ఔట్‌కు సంబంధించి శనివారం రెవెన్యూ అధికారులు లక్కీ డిప్ నిర్వహించి 46 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. గత డిసెంబరు 23వ తేదీన నిర్వహించిన లక్కీడిప్ కార్యక్రమానికి హాజరు కాని లబ్ధిదారుల కోసం మరోమారు తహసీల్దారు కార్యాలయంలో లక్కీ డిప్ నిర్వహించారు. ఈ డిప్‌లో 46 మందిని ఎంపిక చేసిన అధికారులు 43 మందికి పట్టాలు అందజే శారు. గత డిసెంబరు 23వ తేదీన జరిగిన కార్యక్రమంలో 1380 మందికి పట్టాలు పంపి ణీ చేశా మని తహసీల్దారు ధనంజయులు తెలిపారు. ఏపీఐఐసీ 3వ లే-ఔట్‌లో పట్టాలు మంజూ రైన పట్టాలను సోమవారం నుంచి సచివాలయాల్లో పంపిణీ ఏర్పాటు చేశామని, లబ్ధిదా రులు ఎవరూ తహసీల్దారు కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని తెలిపారు. లక్కీ డిప్‌లో పొందిన టోకెన్లతో సచివాలయంలో సంప్రదించాలని సూచించారు.

బీసీలకు వైసీపీ చేస్తున్న మోసాన్ని వివరిస్తాం

● నియోజకవర్గ టీడీపీ పోల్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కుడుం శ్రీనివాసులు

బి.కొత్తకోట జనవరి 6 : వైసీపీ ప్రభుత్వం బీసీలకు చేస్తున్న అన్యాయాన్ని, మోసాన్ని నియోజకవర్గాల వారీగా ప్రజలకు వివరిస్తామని తంబళ్లపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పోల్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం బి.కొత్తకోట మండల కార్యవర్గ సభ్యులతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో టౌన్ కన్వీనర్ వెంకట్రమణ, మండల ప్రధానకార్యదర్శి కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రసాద్, మాజీ మండల కన్వీనర్ నారాయణ, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండి. మస్తాన్, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప, మాజీ ఉపసర్పంచ్ షమీవుల్లా, నాయకులు సిద్దప్ప నాయుడు, శ్రీనాథ్, శరత్, మోహన, రాజా, సురేంద్ర, నాగరాజు, శిల్ప ఆంజి పాల్గొన్నారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మెకు టీడీపీ మద్దతు



సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్న శ్రీరాం చినబాబు

మదనపల్లె, జనవరి 6: మదనపల్లె మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మెలో టీడీపీ నా యకులు పాల్గొని మద్ధతు తెలిపారు.. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు మాట్లాడుతూ..మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. రానున్నది టీడీపీ-జనసేన ప్రభుత్వమేనని పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించేలా చేస్తామన్నారు. మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె 4వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో కార్యక్ర మంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ నేత ఎస్‌ఏ మస్తాన్, మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్, సీనియర్ నాయకుడు రామకృష్ణ, యూనియన్ నాయకులు సురేష్‌కుమార్, మస్తాన్, నాగరాజు, దేవా, ఇంద్రాణి, తిరుమలప్ప, గోపాలు, పృథ్వీరాజ్, ముబారక్ పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో ఆర్థికాభివృద్ధి

రామసముద్రం, జనవరి 6: వృత్తి నైపుణ్యంతో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు శిక్షణా తరగతులు ఉపయోగపడుతాయని వెలుగు సమాఖ్య డీపీఎం రూతూ తెలిపారు. సీఆర్‌పీ, వీవోఏల శిక్షణా తరగతులను ఆమె పరిశీలించి మాట్లాడుతూ మహిళలు తమకు నచ్చిన వృత్తులలో నైపుణ్యం సాధించి తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బి.కొత్తకోట జనవరి 6 : పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్లు బి.కొత్తకోట ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్ తెలిపారు. శనివారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి ఏడుగురుని అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 34,500 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.